క్లుప్తంగా

ఘనంగా నేస్తాలమ్మతల్లి జాతర



పూజలందుకున్న నేస్తాలమ్మ తల్లి

ఎస్.రాయవరం: వమ్మవరం గ్రామంలో నేస్తాలమ్మతల్లి జాతర మంగళవారం ఘనంగా జరిగింది. వరహా నది గట్టుపై కొలువుదీరిన అమ్మవారిని ప్రతి ఏడాది తొలకరి రోజుల్లో ముందుగా వర్షాలు పడి పంటలు బాగా పండాలన్న ఆకాంక్షతో అన్నదాతలు జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ మేరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

6912 ఎకరాల్లో ఖరీఫ్‌కు రైతులు సిద్ధం

పాయకరావుపేట: మండలంలో 6912 ఎకరాల్లో ఈ ఏడాది వరినాట్లు వేయడానికి రైతులు సిద్ధంగా ఉన్నారని మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ తెలిపారు. వరి విత్తనాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదన పంపామన్నారు. ఆర్‌జీఎల్ 2537 బీపీజీ 520, ఎంటీయూ 910 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరమన్నారు. పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగ మరో 45 క్వింటాళ్లకు ప్రతిపాదనలు పంపించినట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ 100 శాతం బయో గ్రామంగా ఆర్.కొత్తూరును ఎంపిక చేశామన్నారు.

ఓ మోస్తరు వర్షం



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ఎస్.రాయవరం: మండలంలో మంగళవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రతతో ఇబ్బంది పడిన జనం సాయంత్రం వర్షం పడడంతో ఉపశమనం పొందారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నిలిచిపోయింది. రేవుపోలవరం రోడ్డుపై ఎక్కువగా నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు.

వైభవంగా పైడితల్లి అమ్మవారి పండగ



పైడితల్లి అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: మండలంలోని అరబుపాలెంలో మంగళవారం పైడితల్లి అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు తుట్టా వెంకటప్పారావు, కాకి అప్పలనాయుడు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి రథయాత్ర



తిమ్మరాజుపేటలో సత్యసాయి రథయాత్రలో పాల్గొన్న భక్తులు

మునగపాక: భగవాన్ సత్యసాయి 100వ జయంతి వేడుకల్లో భాగంగా మంగళవారం రథయాత్ర ఘనంగా ప్రారంభమైంది. తిమ్మరాజుపేటకు చెందిన సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రథయాత్ర మునగపాక, తిమ్మరాజుపేట గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో సాగింది. ఈ రథయాత్రకు భక్తులు భారీగా తరలివచ్చి సాయి నామ స్మరణ చేశారు. ఈ కార్యక్రమంలో భజన మండలి సభ్యులు సరిసా శివ గణేష్, అప్పలనాయుడు, రమణ, పలువురు భక్తులు పాల్గొన్నారు.

మునగపాకలో చలివేంద్రం ఏర్పాటు



మునగపాకలో మజ్జిగ అందిస్తున్న దృశ్యం

మునగపాక: మునగపాకకు చెందిన పెంటకోట రవి గణేష్ వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక మెయిన్‌రోడ్డులో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసి, బిస్కట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య ఉద్యోగి పెంటకోట జగన్ మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

- కోటవురట్ల మండలంలో యథేచ్ఛగా సాగుతున్న అక్రమ తవ్వకాలు
- అధికారం అండతో సొమ్ము చేసుకుంటున్న ఓ టీడీపీ నేత
- చినబొడ్డేపల్లి రెవెన్యూ పరిధిలో కరిగిపోతున్న 4 కొండలు
- యండపల్లి ఎస్సీ కాలనీ సమీపంలోనూ తవ్వకాలు
- పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు

ఆగని గ్రావెల్ దందా.!





చినబొడ్డేపల్లిలో గ్రావెల్ తవ్వకాలు, (ఇన్‌సెట్) యండపల్లిలో గ్రావెల్ తవ్వకాలతో సగం తరిగిపోయిన కొండ

కోటవురట్ల: కొండలు కరిగిపోతున్నాయి.. గుట్టలు తరిగిపోతున్నాయి.. నిబంధనలకు తూట్లు పొడుస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. కూటమి ప్రభుత్వం రాకతోనే అక్రమార్కులు పేట్రేగిపోతున్నారు. అందినకాడికి దోచుకుని సొమ్ము చేసుకుంటున్నారు. కూటమి పాలనలో అక్రమాలకు అంతే లేకుండా పోతోంది. ఇసుక, గ్రావెల్, మట్టి ఏదైనా కానీ జంకూ బొంకూ లేకుండా దోచుకుపోతున్నారు. అక్రమార్కులకు మంత్రి నుంచి స్థానిక నేతల వరకు భరోసా ఉండడంతో ఏమాత్రం వెరవక సంపాదన కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. అధికారులు కూడా అసలు ఏమీ తెలియనట్టుగా వ్యవహరిస్తుండడంతో అక్రమార్కులు పేట్రేగిపోతున్నారు. ఏ పనికైనా గ్రావెల్, రాయి తప్పనిసరి కావడంతో వీటికి నిరంతరం డిమాండ్ ఉంటోంది. ఈ వ్యాపారానికి పైసా పెట్టుబడి పెట్టనవసరం లేదు. కూటమి ప్రభుత్వం అండ, ఓ నాలుగు ట్రాక్టర్లు, ఓ ప్రొక్లెయిన్ ఉంటే చాలు. ఆహ్లాదాన్ని పంచే పచ్చని కొండలను పిండి చేసి జేబు నింపేసుకోవచ్చు. ఇదే అక్రమ వ్యాపారాన్ని ఓ టీడీపీ నాయకుడు కూటమి ప్రభుత్వ అండను పెట్టుబడి చేసుకుని దర్జాగా చేస్తున్నాడు. పట్టపగలే కొండలను గుల్లచేసి గ్రావెల్, రాయిని దోచుకుపోతున్నాడు. కొండలు తరిగిపోతున్నా అధికారులు మాత్రం సమాచారం లేదన్న మాటతో తమకేం తెలియదని చెప్పడం పరిపాటిగా మారింది.

మండలంలో చినబొడ్డేపల్లి, యండపల్లి రెవెన్యూ పరిధిలో గ్రావెల్ దందా సాగుతోంది. చినబొడ్డేపల్లి రెవెన్యూ పరిధిలో ఒట్టిగోడు కొండ, నూకాలమ్మ ఆలయం వద్ద ఉన్న కొండ, కరణం కొత్తూరు, విశ్వనాథపురం పరిధిలోని నాలుగు కొండలపై అక్రమ గ్రావెల్ తవ్వకాలు నిరంతరం సాగుతున్నాయి. ఈ నాలుగు కొండలపై రెడ్డి కొత్తూరుకు చెందిన ఓ టీడీపీ నాయకుడు దర్జాగా తవ్వేసి గ్రావెల్, రాయిని తరలించి సొమ్ము చేసుకుంటున్నాడు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే నాలుగు కొండలు సగానికి తరిగిపోయాయంటే ఏ స్థాయిలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. సదరు టీడీపీ నాయకుడు తన సొంత ప్రొక్లెయిన్, ట్రాక్టర్లతో ఈ వ్యాపారాన్ని సాగిస్తున్నాడు. ప్రతి రోజు ఒక ప్రొక్లెయిన్, 8 ట్రాక్టర్లతో అక్రమ దందా సాగుతోంది. ఇక్కడి నుంచి రెండు కిలోమీటర్ల పరిధిలో గ్రావెల్ సరఫరాకు ఒక ట్రాక్టరుకు రూ.850, స్థానికంగా అయితే ట్రాక్టరుకు రూ.500 వసూళ్లు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఒక రోజుకు పది ట్రిప్పులు అంటే సుమారు 60 నుంచి 80 ట్రాక్టర్ల ద్వారా గ్రావెల్ తరలిపోతోంది. ఇలా సదరు టీడీపీ నాయకుడి అక్రమ సంపాదన రోజుకు సగటున రూ.30 వేలు వరకు ఉంటోంది. నెలలో 15 రోజులకు చూసినా రూ.4,50,000 సంపాదన. ఇలా గడిచిన పది నెలల్లో సగటున లెక్కచూసినా సుమారు రూ.2.70 కోట్లు సొమ్ము చేసుకున్నాడు.

● యండపల్లి రెవెన్యూ పరిధిలో కూడా అక్రమ గ్రావెల్ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఎస్సీ కాలనీని ఆనుకుని ఉన్న డీ పట్టా భూమిలో రాత్రి వేళల్లో గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారు. ఇందు కోసం జగనన్న లే అవుట్ పక్క నుంచి ప్రత్యేకంగా రోడ్డు కూడా వేశారంటే ఎంతగా వ్యాపారం సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇంత జరుగుతున్నా ఇటు రెవెన్యూ, పోలీసు, అటు మైనింగ్ అధికారుల దాడులు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇదే పరిస్థితి ఇంకొక ఏడాది ఉంటే చాలు కొండలు మాయమయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొండలపై అక్రమ తవ్వకాలను నివారించాలని పలువురు కోరుతున్నారు.

అక్రమ తవ్వకాలకు అడ్డేలేదు..



మండలంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. నిరంతం తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. చినబొడ్డేపల్లి రెవెన్యూ పరిధిలోని నాలుగు కొండలపై అక్రమ తవ్వకాలు భారీగా జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– పైల శివరామ్, సర్పంచ్, చినబొడ్డేపల్లి

అధికారులు పట్టించుకోలేదు..



గ్రావెల్ అక్రమ తవ్వకాలను అధికారులు పట్టించుకోలేదు. చీకటి పడితే చాలు కొండలను తవ్వేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే కొన్నాళ్లకు పర్యావరణానికి చేటు తప్పదు. ఇప్పటికే వాతావరణం వేడెక్కి తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. కొన్నాళ్లకు కొండలు మాయమైతే పరిస్థితి దారుణంగా ఉంటుంది.

– గొర్లు నానిబాబు, యండపల్లి

చర్యలు తీసుకుంటాం..



గ్రావెల్ తవ్వకాల గురించి సమాచారం లేదు. మాకు ఎవరూ ఫిర్యాదు చేయలేదు. ఎక్కడైనా తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటాం. స్థానికులు సమాచారం అందించాలి. తవ్వకాలు జరుపుతున్న చోట నిఘా పెడతాం.

– ఎల్.తిరుమలబాబు, తహసీల్దారు, కోటవురట్ల మండలం

కృత్రిమ అవయవాల కోసం పరీక్షలు



దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందించేందుకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

అచ్యుతాపురం రూరల్ : భాగవతుల చారిటబుల్ ట్రస్ట్(బీసీటీ) ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలు అందజేసేందుకు మంగళవారం పరీక్షలు చేశారు. వెంకటాపురం కూడలిలో ఉన్న బీసీటీ సహకారంతో స్టీల్ ప్లాంట్‌లోని ఏఎంటీజెడ్ నుంచి వచ్చిన వైద్యులు దివ్యాంగుల అవయవాలకు సరిపడా కొలతలు తీసుకున్నారు. సుమారు 100 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందజేయనున్నట్లు ట్రస్ట్ సెక్రటరీ భాగవతుల శ్రీరామమూర్తి తెలిపారు. ఈ నెల 29న వినికిడి లోపం ఉన్నవారికి ఉచితంగా చికిత్స చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎల్ఎఫ్‌సీ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.వి.సీతారామరాజు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు నాగేశ్వరరావు, పి.ఎ.నాయుడు పాల్గొన్నారు.



కృత్రిమ అవయవాల కోసం హాజరైన దివ్యాంగులు

నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

మునగపాక : మండలంలోని మడకపాలెంలో నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిని మంగళవారం అనకాపల్లి ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. మడకపాలెంలో నాటుసారా విక్రయిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు ఎక్సైజ్ అధికారులు నాయుడు, గణేష్ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో లగిశెట్టి బాబూరావు 2 లీటర్ల నాటుసారా విక్రయిస్తున్నట్లు గుర్తించి అరెస్ట్ చేశారు.

భూసేకరణ నోటిఫికేషన్ ఉపసంహరించుకోవాలి



నోటిఫికేషన్ రద్దు చేయాలంటూ నిరసన తెలుపుతున్న రైతులు

నక్కపల్లి: మండలంలో బల్క్ డ్రగ్ పార్క్ నిర్మాణం కోసం సీహెచ్ఎల్ పురంలో భూసేకరణ కోసం ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు ఆధ్వర్యంలో రైతులు గ్రామంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీహెచ్ఎల్ పురం రెవెన్యూ పరిధిలో జానకయ్యపేటలో 98 మంది రైతులకు చెందిన 198 ఎకరాల భూమిని బల్క్ డ్రగ్ పార్క్ కోసం సేకరిస్తున్నట్లు ఇటీవల ప్రభుత్వం 4(1) నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. భూసేకరణ కోసం గ్రామంలో సర్వే చేసినప్పుడు, తహసీల్దార్ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించినప్పుడు తమ భూములు ఇచ్చే ప్రసక్తి లేదని స్పష్టం చేశామన్నారు. అయినా ప్రభుత్వం ఏకపక్షంగా రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కొనేందుకు నోటిఫికేషన్ విడుదల చేయడం దారుణమన్నారు. తక్షణం నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఈ ఆందోళనలో రైతులు దేవర సత్తిబాబు, కురందాసు అప్పలరాజు, మామిడి బాబ్జి, పంపన బోయిన తులసీరావు, చందక నానాజీ, దేవర అప్పలరాజు, మనబాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో ఉమ్మడి కుటుంబాలకు అన్యాయం

- మరోసారి సర్వే నిర్వహించాలి
- తహసీల్దార్‌కు వైఎస్సార్‌సీపీ నేతల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు నర్సింహమూర్తి

నక్కపల్లి: ఏపీఐఐసీకి భూములిచ్చిన నిర్వాసితుల్లో ఉమ్మడి కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో అన్యాయం జరిగిందని, దీన్ని సరిచేసి అందరికీ సమానంగా ప్యాకేజీ వర్తింపజేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన పలువురు నిర్వాసితులతో కలిసి తహసీల్దార్ నర్సింహమూర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజయ్యపేట, బోయపాడు గ్రామాల్లో పరిశ్రమల కోసం నివాస ప్రాంతాలను ఖాళీ చేయిస్తున్నారన్నారు. నిర్వాసితులను గుర్తించే సమయంలో కొంత మంది మత్స్యకారులు పొట్టకూటి కోసం ఇతర ప్రాంతాలకు తాత్కాలికంగా వలస వెళ్లారన్నారు. ఇలా వలస వెళ్లిన వారిలో చాలా మంది ఉమ్మడి కుటుంబాలకు చెందిన వారేనన్నారు. ఒకే ఇంట్లో ముగ్గురు, అంతకు మించి ఎక్కువ అన్నదమ్ములు, తండ్రులు, కొడుకులు, అక్క చెల్లెళ్లు నివసిస్తున్నారన్నారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించేందుకు ప్రభుత్వం ఎన్యూమరేషన్ చేసే సమయంలో ఇంట్లో ఎవరు నివసిస్తే వారి పేర్లే నమోదు చేసుకుని వెళ్లారన్నారు. వలసపోయిన వారి ఇళ్లకు తాళాలు వేసి ఉండడం వల్ల వారి పేర్ల నమోదు చేయలేదన్నారు. ఇంటి మొత్తానికి ఒకే యజమాని పేరు నమోదు చేసుకుని వెళ్లడం వల్ల ప్రభుత్వం ప్రకటించిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి ఒక వ్యక్తే అర్హత సాధించాడన్నారు. ముగ్గురు అన్నదమ్ములు ఒకే ఇంట్లో నివశిస్తే ఎన్యూమరేషన్‌లో అధికారులు ఒక వ్యక్తి పేరు నమోదు చేయడం వల్ల మిగిలిన ఇద్దరూ నష్టపోతున్నారని చెప్పారు. ఇలా చాలా మంది ఉన్నారన్నారు. ప్రస్తుతం నివాస ప్రాంతాలను ఖాళీ చేయిస్తే వీరంతా రోడ్డున పడతారన్నారు. వీటిని సరిచేయాలని ఇటీవల నిర్వహించిన గ్రామసభల్లో బాధితులు అధికారులకు వినతి పత్రాలు అందిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇటువంటి వారి కోసం మరోసారి సర్వే చేయాలన్నారు. దీనిపై తహసీల్దార్ నర్సింహమూర్తి మాట్లాడుతూ సర్వే చేసిన సమయంలో ఎవరి పేరు నమోదయితే వారిపేరున మాత్రమే ప్యాకేజీ, నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. ఈ వ్యవహారం తన పరిధిలో లేదని, ఆర్‌డీవోకు కూడా వినతి పత్రం ఇస్తే వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. త్వరలోనే ఆర్‌డీవోను కలిసి ఈ సమస్యను తెలియజేస్తామని శీరం నర్సింహమూర్తి చెప్పారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



కిశోర వికాసం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రతినిధి రమ్య

మునగపాక: బాల్య వివాహాలను ప్రతి ఒక్కరూ అరికట్టాలని అనకాపల్లి జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రతినిధి కేఎల్‌పీ రమ్య కోరారు. మునగపాక పంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం కిశోర వికాసం వేసవి విజ్ఞానంలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల అక్రమ రవాణా, బాలికలపై వేధింపులు, వీధి బాలలను గుర్తించి వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. కిశోర బాలికలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ, ఏఎన్ఎంలు రేవతి, ఆదిలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ సంతోషి, అంగన్‌వాడీ టీచర్ ఉమాదేవి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట ఎరువులు

మునగపాక: స్థానిక రైతు సేవా కేంద్రంలో పచ్చిరొట్ట ఎరువులు అందుబాటులో ఉన్నాయని మునగపాక వీఏఏ సింధూజ ఒక ప్రకటనలో తెలిపారు. సీజన్‌కు అవసరమైన జనుములు, జీలుగ, పిల్లి పెసర విత్తనాలు సమకూర్చామన్నారు. జనుములు 10 కిలోలకు రూ.545, జీలుగ 10 కిలోలకు రూ.615, పిల్లిపెసర 8 కిలోలు రూ.720 వంతున అందజేస్తామన్నారు. ఆసక్తి కల రైతులు ఆధార్ కార్డును తీసుకువచ్చి పచ్చిరొట్ట ఎరువులను కొనుగోలు చేసుకోవాలని ఆమె కోరారు.

కేజీబీవీలో 9,10 తరగతుల ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ



ఎంఈవో జానుప్రసాద్

రోలుగుంట: జేనాయుడుపాలెం గ్రామంలో గల కేజీబీవీ 4 టైపు ఉన్నత పాఠశాలలో 9,10 తరగతుల్లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మండల విద్యాశాఖాధికారి జానుప్రసాద్ తెలిపారు. స్థానికులై ఉండి, మధ్యలో బడిమానివేసిన బడి ఈడు పిల్లలు, అనాథలు, ఒక్కరే పేరెంట్ (తల్లి,లేక తండ్రి)గల తెల్లరేషన్ కార్డు కలిగిన వారు అర్హులని తెలిపారు. ఆన్‌లైన్‌లో లేదా, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9912560441 లేదా, 9866808744 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

యోగా ఓ దినచర్య కావాలి



కోటవురట్లలో యోగాసనాలు వేస్తున్న అధికారులు



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషారాణి



నక్కపల్లిలో యోగా చేస్తున్న సచివాలయ సిబ్బంది

కోటవురట్ల: ప్రస్తుత ఆహారపు అలవాట్లతో సురక్షితంగా ఉండాలంటే ప్రతి ఒక్కరి జీవితంలో యోగా ఒక భాగం కావాలని తహసీల్దారు తిరుమలబాబు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగాంధ్ర కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పీఈటీలు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. తహసీల్దారు మాట్లాడుతూ యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు మాట్లాడుతూ యోగా శిక్షణ కార్యక్రమం 5 రోజుల పాటు సాగుతుందన్నారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రఘురాం, సచివాలయం, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

మునగపాక: యోగాతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎంపీడీవో ఎం.ఉషారాణి పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక రాహుల్ గాంధీ కల్యాణ మండపంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. యోగాతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. ఈవోఆర్డీ సోమరాజు, మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నక్కపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సచివాలయ సిబ్బందికి యోగా తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో సీతారామరాజు పర్యవేక్షణలో వివిధ గ్రామాల్లో పని చేస్తున్న సచివాలయ సిబ్బందికి యోగాపై అవగాహన కల్పించడంతో పాటు, యోగాసనాలు వేయించారు. యోగా ఇన్‌స్ట్రక్టర్ రాంబాబు ఆధ్వర్యంలో నాలుగురోజుల పాటు ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తామని ఎంపీడీవో తెలిపారు.

రోడ్డుపై మురుగునీటితో అవస్థలు



నివాసాల నుంచి నేరుగా రోడ్డుపై వస్తున్న మురుగు



రోడ్డు పక్కన కాలువలా ప్రవహిస్తున్న మురుగునీరు

ఎస్.రాయవరం: మండల ముఖ్య వాణిజ్య కేంద్రమైన అడ్డురోడ్డు జంక్షన్‌లో పారిశుధ్యం క్షీణించింది. ఇక్కడ బహుళ అంతస్తుల్లో నివాసదారులు వాడుక నీటిని నేరుగా మెయిన్ రోడ్డుపైకి వదిలేస్తున్నారు. పెదగుమ్ములూరు, తిమ్మాపురం పంచాయతీల సరిహద్దుగా ఉన్న ఈ రోడ్డుపైకి పెదగుమ్ములూరు పంచాయతీలో భవనాల నుంచి నేరుగా వదిలేయడంతో రోడ్డంతా దుర్గంధభరితంగా తయారవుతోంది. ఈ రోడ్డులో రాకపోకలకు చిరు వ్యాపారులు, పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు నానా అవస్థలు పడుతున్నారు. ఆయా గ్రామాల పంచాయతీ అధికారులు పరిశీలించి డ్రైనేజీలు నిర్మాణం చేపట్టాలని, అంతకు ముందుగా నివాసాల నుంచి విడుదలవుతున్న మురుగును నిరోధించాలని పలువురు కోరుతున్నారు.

జీవో నెంబర్ 4తో వీఆర్వోలపై పని ఒత్తిడి



కె.కోటపాడులో తహసీల్దార్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందిస్తున్న వీఆర్వోలు

కె.కోటపాడు : రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 17న విడుదల చేసిన జీవో నెంబర్ 4 కారణంగా వీఆర్వోలపై తీవ్ర పని భారం, ఒత్తిడి పడనున్నట్టు జిల్లా వీఆర్వోల సంఘం ఉపాధ్యక్షుడు పూడి సురేష్, మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడు అనంత్ అన్నారు. రాష్ట్ర వీఆర్వోల సంఘం పిలుపు మేరకు మంగళవారం తహసీల్దార్ డి.రమేష్‌బాబుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 4 కారణంగా రెండు సచివాలయాలకు ఒక వీఆర్వో ఉండాల్సి వస్తుందన్నారు. ఈ కారణంగా రాష్ట్రంలో పని చేస్తున్న 7502 మంది వీఆర్వోల భవిష్యత్ ప్రశ్నార్థకం అవుతుందన్నారు. ఇప్పటికే రీసర్వే, పీజీఆర్ఎస్, రెవెన్యూ సదస్సులతో పాటు రోజువారి రెవెన్యూ విధులను నిర్వహిస్తున్న వీఆర్వోలకు రెండు సచివాలయాలకు ఒకరు విధులను నిర్వహించడం వల్ల పని భారం, ఒత్తిడి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జీవోను సవరించి వీఆర్వోలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని వీరు కోరారు. కార్యక్రమంలో వీఆర్వోల సంఘం మండల కార్యదర్శి శివ, జిల్లా కోశాధికారి గౌరీశంకర్, పూడి శేషగిరి, జ్యోతి, విజయశ్రీ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలి



డిపో ఆవరణలో రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న కార్మికులు

అనకాపల్లి టౌన్: మహిళ ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు వెంటనే మంజూరు చేయాలని ఎన్ఎంయూఏ జోనల్ జాయింట్ కార్యదర్శి జి శంకర్రావు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 88వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ 1-2019 సర్క్యులర్ అమలు చేయాలని, డిపోలో సర్క్యులర్‌కి విరుద్ధంగా అక్రమంగా సస్పెండ్ చేసి డిపోను మార్చిన ఉద్యోగులను యదావిధిగా పాత డిపోలోనే కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు ఏఎస్ రావు, పీవీఎస్ రావు, కేఆర్ లక్ష్మి, కేఈ రావు తదితరులు పాల్గొన్నారు.